క్లుప్తంగా

అపర్ణాదేవి దీక్షలు ప్రారంభం



అపర్ణాదేవి మాల ధరించిన భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి మాలధారణ దీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన 54 మంది భక్తులు అమ్మవారి దీక్ష స్వీకరించారు. ఆలయ అర్చకులు ఆకుండి వెంకటేశ్వర శర్మ, ఆకొండి ప్రభాకరశాస్త్రి భక్తులకు మాలాధారణ చేశారు. 11 రోజుల పాటు ఈ దీక్షలు కొనసాగుతాయని అర్చకులు తెలిపారు. ఆలయంలో గురువారం నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు 15 మంది గైర్హాజరు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ తెలిపారు. మొత్తం 269 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావల్సి ఉండగా 254 మంది హాజరయ్యారన్నారు. కాగా 15 మంది పరీక్షలకు గైర్హాజరైనట్టు వివరించారు.

సామాజిక చైతన్యంతో మహిళాభ్యుదయం

పెద్దాపురం: సామాజిక చైతన్యం ద్వారా మహిళాభ్యుదయం సాధ్యమని పీఓడబ్ల్యూ పెద్దాపురం డివిజన్ అధ్యక్షురాలు కె.లక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన మహిళా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక మనుగడలో అనేక పోరాటాల ఫలితంగానే మహిళలు పలు హక్కుల సాధించారన్నారు. ప్రతి మహిళా రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలన్నిటిలో అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి వి.చిట్టిబాబు, మయూరి, గంగాభవానీ, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌ల పంపిణీ



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేస్తున్న చిన్నబాబు

పెద్దాపురం: స్థానిక ఎస్ఆర్ఆర్, ఎస్‌కేఎం విద్యా సంస్థల ఆవరణలో ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. విద్యా సంస్థల చైర్మన్ కుంచే చినబాబు, డైరెక్టర్ వి.చక్రం తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నామని సుమారు 500 మందికి వాటిని పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ చక్రవర్తి, డైరెక్టర్లు ఏసుబాబు, మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లికి జూనియర్ కళాశాల మంజూరు



కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాల

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వం జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసిందని పాఠశాల హెచ్‌ఎం రమణమూర్తి బుధవారం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. దీనిపై పూర్తి మార్గదర్శకాలు రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం బాలురు, బాలికలు జిల్లా పరిషత్ పాఠశాలలో సుమారు 1400 మంది విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. కళాశాల మంజూరు చేయడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు కృతజ్ఞతలు తెలిపారు.

కాలుష్య పైపులైన్లు తొలగించాలి

కొత్తపల్లి: తీరప్రాంతంలో పరిశ్రమల నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని, సముద్రంలోకి వేసిన కాలుష్య పైపులైన్లను తొలగించాలని మత్స్యకార సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మత్స్యకారులు మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేట బీచ్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. తీరప్రాంతంలో నిర్మిస్తున్న పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను పైపులైన్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడం వలన మత్స్య సంపద అంతరించిపోతుందన్నారు. కాలుష్యం కారణంగా తీరప్రాంతంలో మత్స్యకారులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తీరంలో పరిశ్రమల నిర్మాణం నిలిపివేయడంతో పాటు, సముద్రంలోకి వేసిన పైపులైన్లను తొలగించే వరకూ ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు.



పంచారామ క్షేత్రంలోని స్వామి వారి కల్యాణం

స్వామి పరిణయం.. శోభాయమానం

- ఘనంగా గ్రామోత్సవం అనంతరం వైభవంగా కల్యాణం
- భీమేశ్వరాలయంలో రేపు మహాశివరాత్రి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర ఆలయంలో బుధవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, పట్టువస్త్రాలు బంగారు కిరీటంతో అలంకరణలు చేశారు. ఆలయంలో బుధవారం నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 8వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 9న రథోత్సవం, 11న స్వామి వారి శ్రీపుష్పయోగోత్సవంతో ముగుస్తాయి. ఉదయం ఆలయంలో విఘ్నేశ్వరపూజ, అంకురారోపణ, దీక్షాధారణ నిర్వహించారు. భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయి స్వామి వారికి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించగా పండితులు స్వామి అమ్మవార్లకు అలంకరణ చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి దీక్షాధారణ చేపట్టారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకటేశ్వర రావు, చీమలకొండ గోపాలం, అల్లక్కి రాజ్‌గోపాల్,, శ్రీకాకుళపు విజయ్, చెరుకూరి రాంబాబు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వై.శ్రీనివాసు, ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఆలయ సూపరింటెండెంట్ ఎ.ఈశ్వరరావు, భక్త సంఘం నాయకులు బిక్కిన సాయి, కర్రి వెంకటలక్ష్మి, చల్లా సత్తిబాబు, తలుపుల అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా కల్యాణం

కల్యాణ ఉత్సవాలల్లో భాగంగా మధ్యాహ్నం నంది వాహనంపై గ్రామోత్సవాన్ని ఆలయ పండితుల వేద మంత్రాల మధ్య ఈఓ నీలకంఠం ప్రారంభించారు. ఉత్సవకమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు. గ్రామోత్సవం పూర్తి చేసుకొని రాత్రి 9.30 నిమిషాలకు ఆలయానికి చేరింది. అనంతరం స్వామి వారి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్యాండ్ మేళాల మధ్య ఆలయంలోని తోటలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారి అమ్మ వారి విగ్రహాలను రాత్రి 10.15 నిమిషాలకు ఉంచారు. 12 గంటల వరకు కల్యాణం జరిగింది. అన్నవరం దేవస్థానం నుంచి వేదపండితులు పట్టు వస్త్రాలు తీసుకొని వచ్చారు. పారిశ్రామిక వేత్త గంజి బూరయ్య ముత్యాల తలంబ్రాలు ఏర్పాటు చేశారు. అన్నవరం, ఆలయ వేదపండితులు వేద మంత్రాల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావులు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో ఎమ్మెల్యే రాజప్ప, పట్టణ పరిధిలోని పారిశ్రామిక వేత్తలు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘం భక్తులకు సేవలందించారు.

కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం



ఎన్నికలకు సహకరించాలి

- ఆర్డీఓ జేవీఎస్ రామారావు
- రాజకీయ నేతలతో సమావేశం

పెద్దాపురం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేవీఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నియోజకవర్గ స్థాయిలో ఆయా రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ జేవీఎస్ రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి అంశంపై క్షుణ్ణంగా ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలనే ఉద్దేశంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గ ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల నిర్వహణ వంటి అంశాలపై ప్రజా ప్రతినిధులకు ఇది వరకే పూర్తి వివరాలు తెలియజేశామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల విషయంలో కూడా పూర్తి అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం వయో వృద్ధులు, 45 శాతం దివ్యాంగులకు ఇంటి వద్దనే వారి ఓటు వేసేలా చర్యలు తీసుకుందన్నారు. అనంతరం పలు అంశాలపై రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు అవగాహన కలిస్తూ ఆయా ప్రజా ప్రతినిధులకు ఉన్న ప్రశ్నలకు సూచనలు, సలహాలిచ్చారు. కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, గవరసాని సూరిబాబు (వైఎస్సార్ సీపీ), రంధి సత్తిబాబు (టీడీపీ) డి.క్రాంతికుమార్ (సీపీఎం) కరణం ప్రసాదరావు (సీపీఎం)తో పాటు ఆయా పార్టీల రాజకీయ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతన్న ఆర్డీఓ రామారావు

నియమావళిపై అవగాహన కల్పించాలి

పెద్దాపురం: ఎన్నికల నియమావళిపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మాస్టర్ ట్రైనీలపై ఉందని ఈఆర్వో జేవీఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో బుధవారం మాస్టర్ ట్రైనీస్, ఏఈఆర్‌ఓలతో ఆయన చర్చించారు. ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ఈవీఎంల అవగాహన సదస్సు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై పీఓ, బీఎల్‌ఓలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక లూథరన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల తరగతి గదులను ముందుగానే పరిశీలించి, వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత తహసీల్దార్ల (ఏఈఆర్‌ఓ)పై ఉందన్నారు. మాస్టర్ ట్రైనీలు, ఏఈఆర్‌ఓలు పరిశీలించి, రెండు బ్యాచ్‌లుగా ఈవీఎంలపై శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు పూర్తి చేయాలని రామారావు ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై సూచనలిచ్చారు. పెద్దాపురం, సామర్లకోట తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనీలు జాన్ కెనడీ, సీతారామారావు, ఆయా ట్రైనీలు, ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ తదితరులున్నారు.

కల్యాణం... కమనీయం

- వైభవంగా స్వామివార్ల కల్యాణాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ



ఊరంతా పెళ్లి పెద్దలుగా తరలివచ్చిన వేళ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో వేంచేసిన ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆది దేవుని కల్యాణానికి ముత్తయిదువులు పసుపు వాయ వేయగా భక్తులంతా పెళ్లి పెద్దలుగా తరలి రావడంతో దుర్గాడ గ్రామంలో పెళ్లి సందడి నెలకొంది. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకువచారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు స్వామి వారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు.

వైభవంగా రాజశేఖరస్వామి కల్యాణం

కొత్తపల్లి: గ్రామంలో వేంచేసిన రాజశేఖరస్వామి కల్యాణం బుధవారం కన్నులపండువగా జరిగింది. పండితులు ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో మేళతాళాల నడుమ పల్లకీలో ఊరేగించారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపారు. ఆలయం వద్ద లలితా సహస్ర పారాయణ నిర్వహించారు. కల్యాణోత్సవాల్ల భాగంగా శుక్రవారం కుంకుమ పుజలు, సదస్యం, 9న పాటల పోటీలు, 10న రథోత్సవం, తీర్థం, కోలాట ప్రదర్శన, 11న పుష్పయాగం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం తెలిపారు.



కొత్తపల్లిలో రాజశేఖరస్వామి స్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు



దుర్గాడ శివాలయంలో పసుపు వాయి వేస్తున్న ముత్తయిదువలు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- కాకినాడ ఎంపీ వంగా గీత
- పిఠాపురంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



పిఠాపురంలో అంబేడ్కర్ భవన్‌ను ప్రారంభిస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత

పిఠాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆమె శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో తనదైన ముద్ర వేసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఇప్పటివరకూ చేసింది ఒక ఎత్తయితే ఇక నుంచి చేసేది మరో ఎత్తు అని అన్నారు. పిఠాపురం పట్టణంలో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అంబేడ్కర్ భవన్ ప్రారంభం

పిఠాపురం అంబేడ్కర్ సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రూ.1.20 కోట్లతో నిర్మించిన అంబేడ్కర్ భవన్‌ను ఆమె ప్రారంభించారు. 9వ వార్డులో రూ.26 లక్షలతో నిర్మించనున్న కల్వర్టు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. రూ.29 లక్షలతో పునర్నిర్మించిన పార్కును ఆమె ప్రారంభించారు. 8వ వార్డు డ్రైవర్సు కాలనీ వద్ద సీఎస్ఆర్ నిధులతో నిర్మించే కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం పిఠాపురం మహారాజారావు వెంకటమహీపతి సూర్యారావు బహుద్దూర్ 59వ వర్ధంతి సందర్భంగా సంస్థానంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పిఠాపురం మహారాజా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, రాష్ట్ర స్వచ్ఛ భారత్ డైరెక్టర్ బత్తుల సాయి, ఆర్‌జేయూసీసీ సభ్యుడు రావుల మాధవరావు, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, తలిశెట్టి వెంకటేశ్వరరావు, బోను దేవ, పచ్చిమళ్ల అప్పలరాజు, వజ్రపు వీరేష్, కొత్తపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి మాజీ ఎంపీపీ అత్తిలి చేరిక

సామర్లకోట: మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, సీనియర్ రాజకీయ నాయకుడు అత్తిలి సీతారామ స్వామి వైఎస్సార్ సీపీలో చేరారు. భీమవరంలో పార్టీ కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబుతో హాజరై ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి సమక్షంలో మంగళవారం రాత్రి పార్టీలో చేరారు. ఈ మేరకు బుధవారం దొరబాబు విలేకర్లకు వివరాలు తెలిపారు. మండలంలో సీనియర్ నాయకుడు పార్టీలోనికి రావడంతో పార్టీ మరింత బలోపేతం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, గోపు మురళీ, బండే బాబులు, నాగనబోయిన రాజబాబు పాల్గొన్నారని చెప్పారు.



మిథున్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన అత్తిలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సిబ్బందికి మెమెంటోలు అందజేస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ ప్రవీణ

పిఠాపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ కె.ప్రవీణ సూచించారు. పిఠాపురం ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బందికి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పిఠాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.నిహారిక, ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబటి ఆయిల్స్ భాగస్వామి మృతి

సామర్లకోట: సుమారు 130 సంవత్సరాల చరిత్ర కలిగిన అంబటి ఆయిల్స్ పార్టనర్ సింగవరపు హరినాథరావు (71) బుధవారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దేవతలారా రారండి...!

- పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- శివన్నామ స్మరణతో మార్మోగిన ఆలయం



కుక్కుటేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో బుధవారం ఉదయం ధ్వజారోహణం, అంకురార్పణతో మహాశివరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. పండితులు కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పసుపు వాయ వేశారు. ఆలయ అర్చకులు కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరణ చేశారు. ఈ నెల 8వ తేదీ వరకూ నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఈఓ పులి నారాయణ మూర్తి తెలిపారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు స్వామి వారికి కల్యాణ వస్త్రాలు సమర్పించారు. తొలిరోజు స్వామివారికి గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.



స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించిన పండితులు



పాదగయలో స్వామివారి కల్యాణానికి వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పాదగయక్షేత్రంలో ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

సంక్షేమ పథకాలే విజయానికి నాంది

- నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



దొరబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్న వడ్రంగుల కుటుంబ సభ్యులు

పెద్దాపురం: ప్రభుత్వ పాలనపై ప్రజలకున్న ఆదరణ, సంక్షేమ పథకాలు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలుకుతాయని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలో వడ్రంగుల, తోపుడు బళ్ల వర్తక సంఘాల నుంచి సుమారు 30 కుటుంబాలకు చెందిన సుమారు 150 మంది బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఆయనపై ప్రజాభిమానమే రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి దోహదం చేస్తాయని అన్నారు. అనంతరం ఆయా కుటుంబాల సభ్యులు పార్టీలో చేరగా వారికి దొరబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, తాడి రాజశేఖర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన పెద్దాపురం ముస్లిం సంఘ నాయకులు

వైఎస్సార్ సీపీలోకి ముస్లిం నాయకులు

సామర్లకోట: పెద్దాపురానికి చెందిన ముస్లిం నాయకులు బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయం వద్ద పార్టీలో చేరారు. ముస్లిం నాయకుడు జానీ ఆధ్వర్యంలో చేరిన వారికి నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ముస్లిం సంఘ నాయకులు సయ్యద్ ఖాదర్, బాబులాల్, రజాక్ నబీ, షబ్బీర్, బషీర్, మబ్బుల జానీ సందాని, రబ్బానీ, మోయిన్‌లు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, గృహసారథుల పట్టణ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, పెద్దాపురం మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకారులపై కేసు

కొత్తపల్లి: మండలంలోని కోనపాపపేట బీచ్‌రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసిన వారిపై కేసు నమోదు చేసినట్టు బుధవారం స్థానిక పోలీసులు తెలిపారు. అనుమతులు లేకుండా రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన సుమారు 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామినాయుడు చెప్పారు.